ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 27 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 7 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## బీజేడీ హయాంలోనూ దోపిడీ

### నవీన్ పట్నాయక్‌పై మోదీ విమర్శలు

భువనేశ్వర్, మే 6 (ప్రభాత ఉదయం): పలు సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వానికి మద్దతు తెలిపిన బిజూ జనతాదళ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. సార్వత్రిక ఎన్నికల వేళ ఈ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ఒడిశా అభివృద్ధి కాకపోవడానికి లోపాలను ఎత్తి చూపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్, బీజేడీ హయాంలో ఒడిశా దోపిడీకి గురైందని ఆరోపించారు. "సమృద్ధిగా నీరు, సారవంతమైన భూమి, ఖనిజాలు, సుదీర్ఘ తీరప్రాంతం, చరిత్ర, సంస్కృతి ఇలా ఎన్నింటినో ..మిగతా 2లో



## రిజర్వేషన్లలో 50 శాతం పరిమితి తొలగిస్తాం

### అవసరమైనంత ఇస్తాం

న్యూఢిల్లీ, మే 6 (ప్రభాత ఉదయం): రిజర్వేషన్లపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కుల అధారిత రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగిస్తుందని, అవసరమైన మేరకు రిజర్వేషన్లు ఇస్తామని అన్నారు. దళిత, వెనకబడిన, గిరిజన వర్గాల ప్రజలకు రిజర్వేషన్ ప్రయోజనాలను పెంచుతుందని రాహుల్ గాంధీ అన్నారు. మధ్యప్రదేశ్ రత్లామ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో సోమవారం ఆయన ఈ ప్రకటన చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని ముగించాలని, మార్చాలని కోరుకుంటున్నాయని.. కాంగ్రెస్, ఇండియా కూటమి రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఈ రాజ్యాంగం మీకు జల్ (నీరు), జంగల్ (అడవి), ..మిగతా 2లో

## మల్కాజిగిరి ప్రజలను ఓటు అడిగే హక్కు నీకు లేదు

### 20 ఏళ్లు కేసీఆర్‌తో కలిసి తెలంగాణను విధ్వంసం చేసింది మీరు కాదా

### ఉప్పల్ కార్నర్ మీటింగ్‌లో ఈటలపై రేవంత్ ఫైర్



హైదరాబాద్, మే 6 (ప్రభాత ఉదయం): ఉప్పల్ కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ను బీజేపీకి తాకట్టు పెట్టిందని, బీఆర్ఎస్ ఒక దిష్టిబొమ్మను ముందు పెట్టింది తప్ప .. ఎన్నికల్లో పోటీ చేయడంలేదని, అయ్యా.. ఈటల రాజేందర్..2001 నుంచి 2021 వరకు ఇరవైఏళ్లు కేసీఆర్‌తో కలిసి తెలంగాణను విధ్వంసం చేసింది మీరు కాదా అని ఆయన అన్నారు. మీకు పంపకాల్లో పంచాయితీతో విడిపోయారు తప్ప ప్రజల కోసం కాదని, 2021లో వరదలు వచ్చి ఈ ప్రాంతం ముంపుకు గురైతే ఆనాడు ఈటల పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్లు మంత్రిగా ఉండి ఏనాడైనా ఉప్పల్ కు వచ్చావా..? అని ఆయన ప్రశ్నించారు. నువ్ ఏం చేశావని.. ఏం తెచ్చావని మల్కాజిగిరి ప్రజలను ఓటు అడుగుతావ్.. మల్కాజిగిరి ప్రజలను ఓటు అడిగే హక్కు నీకు లేదన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అంతేకాకుండా..'రాజేందర్, కేసీఆర్ వేర్వేరు కాదు.. నాణానికి బొమ్మా బొరుసు లాంటి వారు.. కేసీఆర్ కాళేశ్వరం పేరుతో దోచుకుంటుంటే ఆర్థిక మంత్రిగా నిధులు విడుదల చేసింది నువ్వు కాదా రాజేందర్.. కరోనా సమయంలో సంతోష్ రావు కోట్లాది రూపాయలు వెనకేసుకుంటుంటే.. వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్నది నువ్వు కాదా రాజేందర్ నువ్వే కదా దొంగలకు సద్దులు మోసింది రాజేందర్.. అప్పుడే మర్చిపోయావా? హైదరాబాద్ చుట్టు భూములను దోచుకుంటుంటే.. చూస్తూ ..మిగతా 2లో

## హైదరాబాద్ సహా నాలుగు నగరాల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు 'ర్యాపిడో' ఫ్రీ రైడ్

హైదరాబాద్, మే 6 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల కమిషన్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంస్థలు ఓటింగ్ హక్కుల వినియోగంపై సమాచారాన్ని ప్రచారం చేయడం కొనసాగిస్తున్నాయి. దానితో, రైడ్-షేరింగ్ యాప్ 'రాపిడో' రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి పనిచేయడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా ఓటర్లను ఉచితంగా పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని ప్రకటించారు. మే 13న ఎన్నికల రోజున హైదరాబాద్‌తో సహా కరీంనగర్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికల నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల రోజున, ఓటర్లు రాపిడో యాప్ లో VOTE NOW అనే కోడ్ ను ఉపయోగించి ఉచిత రైడ్ ను పొందవచ్చని సంస్థ తెలిపింది. రాష్ట్రంలో ఓటు శాతాన్ని పెంచుకునేందుకు అన్ని విధాలా ..మిగతా 2లో






## నేడు మూడోదశ ఎన్నికలు

### 94 పార్లమెంట్ స్థానాలకు పోలింగ్

### భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

### పోటీలో అమిత్ షా, జ్యోతిరాదిత్య, శివరాజ్ సింగ్

న్యూఢిల్లీ, మే 6 (ప్రభాత ఉదయం): దేశంలో సార్వత్రిక ఎన్నికలు కొనసాగుతున్నాయి. మొత్తం ఏడు విడతల్లో ఎన్నికలు జరగనుండగా.. రెండు విడతలు పూర్తయ్యాయి. మూడో విడతలో భాగంగా పది రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 పార్లమెంట్ స్థానాలకు మంగళవారం మే7న పోలింగ్ జరగనుంది. ఈ లోక్‌సభ స్థానాల్లో ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. మూడో దశలో అసోంలో నాలుగు, బీహార్‌లో ఐదు, ఛత్తీస్‌గఢ్‌లో ఏడు, గోవాలో రెండు, గుజరాత్‌లో 26, కర్ణాటకలో 14, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఉత్తరప్రదేశ్‌లో 10, పశ్చిమ బెంగాల్‌లో 4 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే జమ్మూ కాశ్మీర్‌లో ఒకటి, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూలో రెండు స్థానాల్లో పోలింగ్ జరగనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు మోహరించాయి. మూడో దశలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ నేత, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్, ఎన్సీపీ (ఎస్పీ) నేత, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వంటి ప్రముఖులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో పోలింగ్ ముగిసింది. ఏప్రిల్ 19న జరిగిన తొలి విడత పోలింగ్‌లో 66.14 శాతం, ఏప్రిల్ 26న జరిగిన రెండో విడతలో 66.71 శాతం ఓటింగ్ నమోదైన విషయం తెలిసిందే. అస్సాంలోని ధుబ్రి, కోక్రాఝర్, బార్పేట, గౌహతి, బీహార్‌లోని ఝంజర్‌పూర్, సుపాల్, అరారియా, మాధేపురా, ఖగారియా, ఛత్తీస్‌గఢ్: జంజ్‌గిర్-చంపా, కోర్బా, సుర్గుజా, రాయ్‌ఘర్, బిలాస్‌పూర్, దుర్గ్, రాయ్‌పూర్, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ,గోవా: ఉత్తర గోవా, దక్షిణ గోవా, గుజరాత్: కచ్, బనస్కాంత, పటాన్, మహేసన, సబర్కాంత, గాంధీనగర్, అహ్మదాబాద్ ఈస్ట్, అహ్మదాబాద్ వెస్ట్, సురేంద్రనగర్, రాజ్‌కోట్, పోర్ బందర్, జామ్‌నగర్, జునాగఢ్, అమ్రేలి, భావ్‌నగర్, ఆనంద్, ఖేడా, పంచమహల్, దాహోద్, వడోదర, ఛోటా ఉదయపూర్, భరూచ్, బర్డోలీ , నవ్సారి, వల్సాద్, ..మిగతా 2లో



## రైతులకు గుడ్‌న్యూస్..

### రైతు భరోసా నిధులు విడుదల

హైదరాబాద్, మే 6 (ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రభుత్వం రైతులకు భారీ గుడ్ న్యూస్ చెప్పింది. పంట పెట్టుబడి సాయం కింద రైతులకు అందించే రైతు భరోసా (రైతు బంధు) నిధులను వ్యవసాయ శాఖ సోమవారం విడుదల చేసింది. ఇప్పటి వరకు ఐదు ఎకరాలలోపు వారికి నిధులు విడుదల చేసిన సర్కార్.. సోమవారం ఐదు ఎకరాలు పై బడిన రైతులకు ఫండ్స్ రిలీజ్ చేసింది. ఈ మేరకు రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను వ్యవసాయ శాఖ జమ చేసింది. రూ.2వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్టు సమాచారం. మూడు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. 5 ఎకరాలు లోపు భూమి ఉన్న రైతులకు ఇప్పటికే నిధులు విడుదలయ్యాయి. తాజాగా ఐదు ఎకరాలు పైబడిన వారికి చెల్లింపులు ప్రారంభించారు.

## కాంగ్రెస్ స్కామ్‌ల పార్టీ.. బీఆర్ఎస్ ఏటీఎం పార్టీ

### బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



చౌటుప్పల్, మే 6 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్, బీఆర్ఎస్.. రెండూ కుటుంబ పార్టీలేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో బీజేపీ జన సభ జరిగింది. భువనగిరి పార్లమెంటు పరిధి నుంచి భారీగా బీజేపీ శ్రేణులు తరలివచ్చారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నరసయ్యగౌడ్ తరపున జేపీ నడ్డా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ధ్వజమెత్తారు. తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసింది శూన్యమని ..మిగతా 2లో



## కేసీఆర్‌ను అవమానిస్తే మెదక్‌ను అవమానించినట్లే

### రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ హరీష్ రావు

మెదక్, మే 6 (ప్రభాత ఉదయం): మెదక్‌ను అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి నానా మాటలు అంటున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్‌ను అవమానిస్తే మెదక్‌ను ..మిగతా 2లో

## ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు బిగ్ షాక్

### బెయిల్ నిరాకరించిన రౌస్ అవెన్యూ కోర్టు




న్యూఢిల్లీ, మే 6 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బిగ్ షాక్ తగిలింది. ఈ కేసుకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఈడీ, సీబీఐ కేసుల్లో ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా సోమవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుల్లో వేర్వేరుగా కవిత బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా.. న్యాయస్థానం మే 2న తీర్పు రిజర్వ్ చేసింది. ఎన్నికల నేపథ్యంలో స్టార్ క్యాంపెయినర్ ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని కవిత పేర్కొన్నారు. మహిళగా ..మిగతా 2లో

# కిషన్ రెడ్డిని ఓడిస్తేనే తెలంగాణకు మేలు



## కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే పేదలకు అండ
## దానం గెలిస్తే కేంద్రమంత్రిని చేయిస్తా
## సికింద్రాబాద్ ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 6 (ప్రభాత ఉదయం): కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి ఒరగబెట్టిందేమీ లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కనీసం సొంత నియోజకవర్గానికి కూడా సేవలచేయలేదన్నారు. హైదరాబాద్‌కు మెట్రో రైలు రావడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ కు మద్దతుగా అంబర్‌పేటలో రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి అయిందన్నారు. గత కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ కు ఓఆర్ఆర్, ఫార్మా పరిశ్రమలు వచ్చాయన్నారు. గతంలోనే హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు తీసుకువచ్చామని చెప్పారు. ఇకపై అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ నిర్వహిస్తామని తెలిపారు. మరోసారి కిషన్ రెడ్డి ఎంపీ అయితే ఉపయోగం లేదని.. దానం నాగేందర్ ను లక్ష మెజార్టీతో గెలిపిస్తే కేంద్రమంత్రిని చేసే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు . మోదీ గ్యారెంటీకి వారెంటీ అయిపోందని, రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారని జోస్యం చెప్పారు. అప్పుడే దేశానికి విముక్తి అన్నారు. ఈ సభలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టాలని రేవంత్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో గుజరాత్ వర్సెస్ తెలంగాణ రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శించారు. ఈ ఎన్నికల్లో గుజరాత్ మోదీని ఓడించి, తెలంగాణ ఇచ్చిన రాహుల్ గాంధీని గెలిపించి కాంగ్రెస్ సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్ – బీజేపీ పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపించారు. ఈ ప్రచారంలో దానం నాగేందర్,



శంషాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ రోడ్ షోలో పాల్గొన్న టి. రాము గౌడ్ తదితరులు

## బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి : టి. రాము గౌడ్

బుద్వేల్, మే 6(ప్రభాత ఉదయం) : చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రకాష్ అన్న యువసేన అధ్యక్షుడు టి రాము గౌడ్ కోరారు. శంషాబాద్ లో సోమవారం సాయంత్రం జరిగిన బీఆర్ఎస్ రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి. రాము గౌడ్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యర్థిగా బరిలో నిలిచిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఓటు వేయాలన్నారు.

## రిజర్వేషన్లలో 50 శాతం పరిమితి తొలగిస్తాం

మొదటి పేజీ తరువాయి...

జమీన్ (భూమి)పై హక్కులు కల్పించిందని, అయితే, ప్రధాని మోడీ రాజ్యాంగాన్ని తొలగించేందుకు పూర్తి అధికారం కావాలని కోరుతున్నారని చెప్పారు. తాము గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు ప్రకటించారని ఆరోపించారు. అందుకే వారు 400 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, 400 మర్చిపోండీ, 150 సీట్లు కూడా రావని రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. 90 మంది అధికారులు దేశాన్ని నడుపుతున్నారని, వీరిలో ఒకరు మాత్రమే ఆదివాసీ అని, ముగ్గురు వెనకబడిన తరగతులకు చెందిన వారని, ముగ్గురు దళిత వర్గాలనికి చెందిన వారని రాహుల్ గాంధీ చెప్పారు. మీ వర్గం ప్రజలు మీడియాలో, కార్పొరేట్‌లో లేరని మేము దీన్ని మార్చాలని అనుకుంటున్నామని అన్నారు. అందుకు మేము కులగణన, ఆర్థిక సర్వే చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులకు ఎంఎస్పీ ఇవ్వడంతో పాటు రుణమాఫీ రూపంలో రైతులకు ఉపశమనం కల్పిస్తామని చెప్పారు.

## కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం
### మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కారు
### ఎన్నికల ప్రచారంలో మండిపడ్డ కెటిఆర్



సిరిసిల్ల, మే 6 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపెట్టి.. మోచేతికి బెల్లం పెట్టీ మోసపూరిత హామీలతో గెలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో ఒక్కటి అమలు చేసి మొగుళ్లకు మహిళకు తాకులాట పెట్టిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయా? చెప్పాలరన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతి నగర్, గాంధీచౌక్, తెలంగాణ చౌక్‌లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించి.. కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. నేత కార్మికుల కోసం రూ.3వేలకోట్లు ఖర్చు చేసి కార్మికులను కాపాడుకున్నామన్నారు. ఐదేళ్లలో రూపాయి మందు పంచలేదని.. మీరు నాకు ఇచ్చిన దయ అన్నారు. రాజకీయంగా జన్మనిచ్చింది సిరిసిల్లనేనన్నారు. సిరిసిల్ల పట్టణం అతి సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అబద్దాలు చెపితే డిజిటల్ ప్రపంచలో ఒక్క నిమిషాల్లో దొరికిపోయారన్నారు. అన్నమో రామచంద్ర అనే పరిస్థితి వచ్చిందని.. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ని పట్టుకొని పట్టుకొని కాంగ్రెస్ నేతలు అనేక మాటలు, బూతులు మాట్లాడుతుందంటూ మండిపడ్డారు. వందరోజుల్లో రైతు రుణమాఫీ, పింఛన్లు వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ఓట్లు చేసుకునేటప్పుడు ఒక లెక్క.. ఓట్లు వేయించుకున్నాకా ఒక లెక్క ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు అంటూ విమర్శించారు. కేసీఆర్ మళ్లీ కావాలంటే మే 13 13న కారు గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. అప్పుడే తెలంగాణలో శాసించే అధికారం వస్తుందన్నారు. ఞాముడు అందరివాడని.. మతం పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారన్నారు. వేములవాడ రాజన్న, కొండగట్టు దేవాలయాలు బీజేపీకి పుట్టకముందు నుండే ఉన్నాయన్నారు. సిరిసిల్లలో అనేక అభివృద్ధి పనులు చేసినా, బీజేపీ ఒక్క పనికి చేసిందా..? ఒక్క శిలాఫలకం వేయని వారికి ఎందుకు ఓటు వేయాలన్నారు. మోదీ ముడిచమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ రేట్లపై పన్నులు వేసి వసూలు చేశారని విమర్శించారు. మనకు ప్రధానమంత్రి కాదని.. పిరమైన ప్రధానమంత్రి అంటూ విమర్శించారు. అప్ కీ బార్ 420 అంటున్నారని.. అక్కరకు రాని సుట్టాలకు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు.



### కేసీఆర్ బస్సెక్కి గర్జన చేసిండు కాబట్టి
## రైతుబంధు పడుతుంది
### తెలంగాణ మాజీ సీఎం

నిజామాబాద్, మే 6(ప్రభాత ఉదయం): కేసీఆర్ కుంటుతున్నా, బస్సు ఎక్కి గర్జన చేసిండు కనుక నేడు రైతుబంధు పడుతుందని తెలంగాణ మాజీ సీఎం వ్యాఖ్యానించారు. ఇయ్యాల బీఆర్ఎస్ పిడికిలి బిగిస్తేనే దెబ్బకి దెయ్యం వదిలి, వణుకు మొదలై సీఎం రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తున్నాడు కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ శక్తి బీఆర్ఎస్. తెలంగాణ బలం బీఆర్ఎస్. తెలంగాణ గళం బీఆర్ఎస్ అన్నారు. నిజామాబాద్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేసీఆర్ మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ 150 నినాదాలు చెప్పారని, అందులో ఒక్కటైనా నిజమైందా? అని ప్రశ్నించారు. మోదీ పాలనలో తెలంగాణకు ఏ మేలు జరగలేదన్నారు. నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజల్ని కేసీఆర్ కోరారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ నుంచి నెహ్రూచౌక్ చౌరస్తా వరకు కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. అనంతరం అక్కడి సభలో మాట్లాడుతూ.. తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల, మెడికల్ కాలేజీ ఇవ్వని బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలి? అని ప్రశ్నించారు. మోదీ ముందు చేతులు కట్టుకుని నిల్చుంటరు తప్ప నోరు మెదపని బీజేపీ ఎంపీలు మనకు అవసరమా? అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. మోదీ అచ్చే దిన్ అంటే.. రైతులకు చచ్చేదిన్ వచ్చిందని మండిపడ్డారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని బీజేపీ చెప్పిందని, కానీ వాళ్ల సాగు ఖర్చు మాత్రం డబుల్ అయ్యిందని గులాబీ పార్టీ అధినేత ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు, పసుపు బోర్డు ఇస్తామని చెప్పి బీజేపీ ఎంపీ మోసం చేశాడని ఆరోపించారు. ఎన్నో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిందన్నారు కేసీఆర్. కానీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల హామీలు అమలు చేయకుండా, కాలయాపన చేస్తోందని విమర్శించారు. వరి పంటకు బోనస్ ఇస్తామని, రైతు కూలీలకు నగదు, రైతు బంధు ఇచ్చిందా అని ప్రశ్నించారు. తాను పిడికిలి బిగించి బస్సెక్కి ప్రశ్నించగానే తెలంగాణలో రైతు బంధు నగదు పడుతోందన్నారు. కేసీఆర్ కిట్ సైతం నిలిచిపోయింది, పెళ్లి చేసుకున్న వారికి కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఎందుకు ఇస్తలేరని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ కు రేవంత్ నిధులు ఇవ్వడం లేదు, రూ.2 లక్షల రుణమాఫీ చేసేంత వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వకుండా, వారిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. దాంతో రాష్ట్రంలో మళ్లీ చేనేత కార్మికుల ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేతకాని తనంతో తెలంగాణకు వచ్చే పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి పోతున్నాయని, పాత కంపెనీలు సైతం రాష్ట్రం నుంచి వెళ్లిపోతే పరిస్థితి నెలకొందని.. అందుకు కాంగ్రెస్ పార్టీ అసమర్థత కారణం అన్నారు.

## హైదరాబాద్ సహా నాలుగు నగరాల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు 'ర్యాపిడో' ఫ్రీ రైడ్

మొదటి పేజీ తరువాయి...

పని చేస్తున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 100 నగరాల్లో ఈ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకోసం 10 లక్షల మంది కెప్టెన్లను అందజేస్తామని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గంలో రవాణా సదుపాయం లేకుండా తమ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. హైదరాబాద్‌లో ర్యాపిడో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో తెలంగాణ సీఈవో వికాస్ రాజ్ పాల్గొన్నారు.

### మల్కాజిగిరి ప్రజలను ఓటు అడిగే
## హక్కు నీకు లేదు

మొదటి పేజీ తరువాయి...

ఊరుకుంది నువ్వు కాదా? గద్దర్ ను అవమానించిన నాడు ఎందుకు ప్రశ్నించలేదు.. కేసీఆర్ అవినీతిపై ఈటెల ఏనాడైనా అమిత్ షా, మోదీకి పిర్యాదు చేశారా? ఈటెల, కేసీఆర్ ది పగలు కుస్తీ.. చీకట్లో దోస్తీ.. ఈటెలకు పదవి, పరపతి తప్ప..తెలంగాణ ప్రజల సంక్షేమం పట్టదు.. రిజర్వేషన్లు రద్దు చేసే బీజేపీ వైపు ఉంటారో ఎస్సీ,ఎస్టీ,బీసీల వైపు ఉంటారో రాజేందర్ తేల్చుకోవాలి.. అంగీ మార్చినా, రంగు మార్చినా.. ఎన్ని వేషాలు వేసినా రాజేందర్ ను ప్రజలు నమ్మరు.. మోడీ తెలంగాణకు ఇచ్చిందేం లేదు.. గాడిద గుడ్డు తప్ప.. మల్కాజిగిరి పార్లమెంట్ లో సునీతక్కను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించండి..' అని సీఎం రేవంత్ రెడ్డి.

### కాంగ్రెస్ స్కామ్‌ల పార్టీ..
## బీఆర్ఎస్ ఏటీఎం పార్టీ

మొదటి పేజీ తరువాయి...

విమర్శించారు. ఈ రెండు పార్టీలు కుటుంబ పార్టీలేనన్నారు. కాంగ్రెస్ కుంభకోణాల పార్టీ.. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని విమర్శించారు. అవినీతి కేసులో కవిత జైలుకెళ్లారని పేర్కొన్నారు. రిజర్వేషన్లు పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించి.. మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీలను మోసం చేసి.. ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కోత విధించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. అయోధ్యలో రాముడికి సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు లేవని పార్లమెంట్‌లో చెప్పి మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. హిందుత్వానికి కాంగ్రెస్ పార్టీ విరోధి అని వ్యాఖ్యానించారు. టెర్రరిస్టులపై సర్జికల్ స్ట్రైక్‌లు చేస్తే కాంగ్రెస్ నేతలు ఆధారాలు చూపించాలని అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. భారత రాజకీయాలను సమూలంగా మార్చివేసిన దార్శనికుడు ప్రధాని నరేంద్ర మోడీ అని తెలిపారు. దేశంలో జవాబు దారి రాజకీయాలకు మోడీ నాంది పలికారన్నారు. సంక్షేమ పథకాలు ప్రకటించడమే తప్ప.. అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదని జేపీ.నడ్డా ధ్వజమెత్తారు. తెలంగాణలో నాల్గో విడతలో పోలింగ్ జరగనుంది. మే 13న తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలకు ఓటింగ్ జరగనుంది. ఇప్పటికే రెండు విడతల పోలింగ్ ముగిసింది. మంగళవారం మూడో విడత పోలింగ్ జరగనుంది. అనంతరం మే 13, 20, 25, జూన్ 1న ఓటింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి.

## కేసీఆర్‌ను అవమానిస్తే మెదక్‌ను అవమానించినట్లే

మొదటి పేజీ తరువాయి...

అవమానించినట్లే. ఈ ఎన్నికల్లో రేవంత్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి అని హరీశ్‌రావు సూచించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. దేశాన్ని పదేండ్లు పాలించిన బీజేపే ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పట్లేదు. 5 నెలల తన పాలనలో ఏం జరిగిందో రేవంత్ రెడ్డి కూడా చెప్పడం లేదు. తెలంగాణ ఏడు మండలాలను ఏపీలో కలిపేందుకు సహకరించిన బీజేపీకి కూడా గుణపాఠం నేర్పాలి. రాహుల్ గాంధీ ఆరు గ్యారెంటీలు అమలు అవుతున్నాయని చెప్పాడు. అవి అమలవుతున్న గ్రామాల్లోనే కాంగ్రెస్ వాళ్లు ఓట్లు అడగండి. అమలుకాని చోట ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేయండి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తప్పుడు హామీ ఇచ్చినందకు కాంగ్రెస్ అధిష్టానం క్షమాపణ చెప్పాలి. వంద రోజుల్లో అమలు చేస్తామంటూ కాంగ్రెస్ రాసిచ్చిన బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. మెదక్ జిల్లా ముద్దుబిడ్డ కేసీఆర్ ఉద్యమాన్ని మెదక్ నుండే ప్రారంభించారు. రాష్ట్రమంతా ఉద్యమం చేపట్టారు. ఓటుతో కాంగ్రెస్, బీజేపీలకు మెదక్ ప్రజలు గుణపాఠం చెబుతారు. బీజేపీ 10 సంవత్సరాల పాలనలో ఆదానీ, అంబానీలకు మేలు చేసింది తప్ప పేదవాడికి చేసిందేమీ లేదు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేటలను జిల్లాలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసింది కేసీఆర్. కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే మన జిల్లాను మనం పోగొట్టుకోవడమే. ఉన్న జిల్లాలను పోగొట్టడానికి కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. మెదక్ బీజేపీ అభ్యర్థి గిమ్మిక్కులు, ఫేక్ వీడియోలతో ప్రచారం చేయబోతున్నాడు. ఫేక్ వీడియోలు, సోషల్ మీడియాలో బోగస్ ప్రచారాలు ప్రజలు నమ్మొద్దు. తప్పుడు వార్తలపై, బోగస్ సోషల్ మీడియా ప్రచారాలపై పటాన్‌చెరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాం. మెదక్ ప్రజలు నిజాలను గ్రహించి ఓటు వేయాలి అని హరీశ్‌రావు కోరారు.

## బీజేడీ హయాంలోనూ దోపిడీ

మొదటి పేజీ తరువాయి...

భగవంతుడు ఒడిశాకు ప్రసాదించాడు. అయితే, ఒడిశా ప్రజలు ఎందుకు పేదలుగా మారుతున్నారు? ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఎందుకున్నాయ్? చాలామంది చిన్నారులు పాఠశాలకు ఎందుకు దూరమవుతున్నారు?" అని ప్రశ్నించారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తొలుత కాంగ్రెస్.. ఆ తర్వాత బీజేడీ ఒడిశాను దోచుకున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బ్రహ్మపుర ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. దోచుకున్న సంపదతో బీజేడీలోని చిన్న నాయకులకు సైతం పెద్ద బంగ్లాలు ఉన్నాయని.. కానీ, సీఎం పట్నాయక్ సొంత నియోజకవర్గం హింజిలిలోని ప్రజలు మాత్రం బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాలకు ఎందుకు వలసవెళుతున్నారని ప్రశ్నించారు. కేంద్రం ప్రతి గర్భిణీకి రూ.6 వేలు సాయం అందిస్తోందని.. ఒడిశా ప్రభుత్వం మాత్రం ఈ పథకాన్ని నిలిపివేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఒడిశా అభివృద్ధి పనుల కోసం నిధులు అందించడంలో మోదీ సర్కార్ ఎన్నడూ వెనకాడలేదని ప్రధాని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని రిమోట్ కంట్రోల్ గా అభివర్ణించిన మోదీ.. 'కేంద్రంలో సోనియాగాంధీ రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఉంది. అప్పుడు మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నారు. ఆ దశాబ్ద కాలంలో ఒడిశాకు రూ.లక్ష కోట్ల నిధులు వచ్చాయి. కానీ, మోదీ సర్కార్ మాత్రం పదేళ్లలోనే రూ.3.5 లక్షల కోట్లు ఇచ్చింది. నిధులు సమకూర్చినప్పటికీ అభివృద్ధి చేయడం లేదు" అని విమర్శలు గుప్పించారు.

## నేడు మూడోదశ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

కర్ణాటక: చిక్కోడి, బెల్గాం, బాగల్‌కోట్, బీజాపూర్, గుల్బర్గా, రాయచూర్, బీదర్, కొప్పల్, బళ్లారి, హవేరి, ధార్వాడ్, ఉత్తర కన్నడ, దావణగెరె, షిమోగా,మధ్యప్రదేశ్: గుణ, సాగర్, విదిష, మోరెనా, భింద్, గ్వాలియర్, భోపాల్, రాజ్‌గఢ్, బేతుల్,మహారాష్ట్ర: బారామతి, రాయగడ, ధరాశివ్, లాతూర్, షోలాపూర్, మాధా, సాంగ్లీ, రత్నగిరి–సింధుదుర్గ్, కొల్హాపూర్, హత్కనాంగ్లే,ఉత్తరప్రదేశ్: సంభాల్, హత్రాస్, ఆగ్రా ఫతేపూర్ సిక్రి, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, ఎటా, బదౌన్, అంబాలా, బరేలీ.,పశ్చిమ బెంగాల్: మాల్దా సౌత్, జంగీపూర్, మాల్దా నార్త్, ముర్షిదాబాద్ స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది.

## ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు బిగ్ షాక్

మొదటి పేజీ తరువాయి...

పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్ కు అర్హత ఉందన్నారు. ఈ పిటిషన్ పై విచారించిన న్యాయస్థానం బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చింది. కాగా, కవిత బెయిల్ పిటిషన్లపై ఏప్రిల్ 22న కోర్టులో వాదనలు జరగ్గా.. తీర్పును మే 2 (గురువారం)కు రిజర్వ్ చేసింది. ఆ రోజు విచారణ సందర్భంగా మే 6వ తేదీకి తీర్పు రిజర్వ్ చేసింది. ఈ కేసులో కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో ఆమె 2 బెయిల్ పిటిషన్లు వేశారు. ప్రస్తుతం ఆమె జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైలులో ఉన్నారు. ఏప్రిల్ 22న విచారణ సందర్భంగా కవిత బెయిల్ పిటిషన్లపై ఆమె తరపు లాయర్లతో పాటు ఈడీ, సీబీఐ తరపున లాయర్లు సైతం వాదనలు వినిపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే కవితను అరెస్ట్ చేశారని.. ఈడీ కస్టడీలో ఉండగానే సీబీఐ ఆమెను అరెస్ట్ చేసిందని కోర్టుకు ఆమె తరఫున న్యాయవాది సింఘ్వి వాదించారు. బీఆర్ఎస్ కు కవిత స్టార్ క్యాంపెయినర్ అని ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. 'మహిళగా కల్వకుంట్ల కవిత బెయిల్‌కు అర్హురాలు. ఆమె అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి సాక్ష్యం లేదు. కవిత అరెస్ట్‌కు సరైన ఆధారాలు లేవు. ఆధారాలు లేకుండానే కవితను అరెస్ట్ చేశారు' అంటూ కోర్టుకు తెలిపారు. ఈడీ కస్టడీలో ఉండగానే ఎందుకు సీబీఐ అధికారులు ఆమెను అరెస్ట్ చేశారని.. అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని అన్నారు. తమ రాజకీయ పార్టీకి కవిత స్టార్ క్యాంపెయినర్ అని.. ఇప్పుడు ఆమె ప్రతిపక్షంలో ఉన్నారని వాదించారు. ఆమె పార్టీ రూలింగ్‌లో ఉన్నప్పుడే కేసును ప్రభావితం చేయలేదని గుర్తు చేశారు. ఏడేళ్ల లోపల పడే శిక్ష ఉన్న కేసులో అరెస్ట్ అవసరం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, దీనిపై ఈడీ, సీబీఐ తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. కవితకు బెయిల్ ఇస్తే.. సాక్షులను ప్రభావితం చేస్తారని చెప్పారు. ఈ కేసులో ఆమె కీలక సూత్రధారి అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సాక్ష్యాలను ధ్వంసం చేసే అవకాశం కూడా ఉందని కోర్టుకు తెలిపారు. ఈ కేసులో కవిత కింగ్ పిన్ అని.. కవితకు బెయిల్ ఇవ్వొద్దని అన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఈడీ, సీబీఐ వాదనలతో ఏకీభవిస్తూ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.



# దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

**ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి పెరుగుతున్న ఆదరణ...**
**హస్తం గూటికి చేరిన అల్విన్ కాలనీ సాయి నగర్ ఈస్ట్ వేస్ట్, శివమ్మా బస్తి నాయకులు**
**కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగదీశ్వర్ గౌడ్...**

కూకట్‌పల్లి, మే 6 (ప్రభాత ఉదయం) భారతదేశంలో అభివృద్ధి చెందాలంటే అది ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అల్విన్ కాలనీ డివిజన్ శివమ్మా బస్తి, సాయి నగర్ వెస్ట్, ఈస్ట్ కాలనీలకు చెందిన పలువురు నాయకులు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో వందల మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ వారికి కండువా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. తెలంగాణ రాష్ట్రం మన సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృదే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నారని, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీలో చేరిన ప్రేమావతిపేట్‌కు చెందిన గోల్కొండ నరహరి

బుద్వేల్, మే6(ప్రభాత ఉదయం) : ప్రేమావతి పేట్ కు చెందిన గోల్కొండ నరహరి తో పాటు పలువురు యువకులు సోమవారం బీజేపీ లో చేరారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ప్రగతి కాలనీ లోని ఆయన నివాసానికి వెళ్లిన జంగం గణేష్, కాసింబాకుల హరి , లింగాల జేష్ కుమార్ , చేవెళ్ల రాజేష్, బోడా శ్రవణ్ తదితరులు బీజేపీ లో చేరారు. వారికి తోకల శ్రీనివాస్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



బీజేపీలో చేరిన గోల్కొండ నరహరికి పార్టీ కండువా కప్పుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రచారం చేస్తున్న సంరెడ్డి ప్రమోద్ రెడ్డి

# కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలి

బుద్వేల్, మే6(ప్రభాత ఉదయం) : చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు. సంరెడ్డి ప్రమోద్ రెడ్డి, ఆడికె మహేందర్ కోరారు. సోమవారం లక్ష్మి గూడా హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇంటింటికి తిరిగి బీజేపీ ని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి పదవులు చేపట్టడం ఖాయం అన్నారు.




నవ జ్యోతి యూత్ క్లబ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

# నేడు రాజేంద్రనగర్‌లో మంద కృష్ణ మాదిగ బహిరంగ సభ

బుద్వేల్, మే6(ప్రభాత ఉదయం): ఈనెల 7వ తేదీన సాయంత్రం6 గంటలకు రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ మైదానం లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. సోమవారం వారు నవజ్యోతి యూత్ క్లబ్ మైదానం ను పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ , చేవెళ్ళ పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లా రెడ్డి , రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి మల్లేష్ యాదవ్ , రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి బాబురావు, డివిజన్ ఎస్సీ మోర్చ అధ్యక్షుడు టి. మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఇ. వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రావుగల్ల బాబు మాదిగ , ఎం ఎస్ పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోల్ల నర్సింహ మాదిగ, ఎం ఎస్ పీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ అధ్యక్షులు క్యాసారం శంకర్ రావు మాదిగ, ఎం రత్నం, ఆర్ఎస్ రమేష్, జిల్లా నాయకులు చిట్టిబాబు. జగన్. గణేష్. రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇంఛార్జి కొత్తూరు రమేష్. కో ఇంఛార్జి దప్పు నర్సింహ. యదవరావు. గడ్డం శామ్యూల్. కె.ప్రేమ్ కుమార్, రాజేష్. సుధాకర్, ఎం ఎస్ ఎఫ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ భారతీయ జనతా పార్టీ కి పూర్తి మద్దతు ఇచ్చి మన ప్రియతమ నాయకుడు ప్రధాని నరేంద్రమోడీ ని మూడో సారి ప్రధాన మంత్రి గా గెలిపించాలని కోరారు. చేవెళ్ళ పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



బుద్వేల్ లో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ డివిజన్ ఎన్నికల ఇంచార్జ్ డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్

# ప్రతి ఓటరును కలసి బీజేపీకి ఓటు పడేటట్లు చూడాలి

బుద్వేల్, మే6(ప్రభాత ఉదయం) : పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి ఇంకా ఐదు రోజులే మిగిలి ఉందని, ప్రతి ఓటరును కలిసి బీజేపీ కి ఓటు పడే విధంగా నాయకత్వం , నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ డివిజన్ ఎన్నికల ఇంచార్జ్ డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం బుద్వేల్ వాటర్ వర్క్స్ కార్యాలయం సమీపంలో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ కి ఓటు ఎవరు వేస్తారు. ఓటు ఎవ్వరు వేయరు. మధ్యంతరంగా ఉన్నవారు ఎవరు అనే వివరాలు సేకరించి, వారిని రెండు మూడు సార్లు కలిసి బీజేపీ కి ఓటు వేసేటట్లు చూడాలన్నారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి మంచి నాయకుడనే వివరాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కేంద్రంలో మూడవసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని , ప్రధానిగా తిరిగి నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టడం అంతే ఖాయమని అన్నారు. ప్రతి ఓటరును కలిసి బీజేపీ కి ఓటు పడేటట్లు చూడాలన్నారు. సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి మల్లేష్ యాదవ్, మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితారెడ్డి , పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం శ్రీనివాస్ గౌడ్ , రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీఅధ్యక్షుడు జి బాబురావు, ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్ లో పాల్గొన్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

# మోడీ హటావో దేశ్ కు బచావో

**ఆప్ కీ బార్ ఇండియా కూటమి.**
**కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి**
**సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య**

బుద్వేల్, మే6(ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి గెలిపించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం రాజేంద్రనగర్ లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. మే 13న జరుగనున్న ఎన్నికలలో హస్తం గుర్తు పై ఓటు వేసి రంజిత్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఆయన ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటిని అమలు చేయలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. జన్ ధన్ పథకం ద్వారా ప్రతి పేదవాడి అకౌంట్ లో రూ.15 లక్షలు జమ చేస్తానని అమలు చేయలేదన్నారు. బేటి బచావో... బేటి పడావో అనే నినాదం టీవీ ప్రకటనలకు, పేపర్లో ప్రకటనలకు పరిమితం అయ్యిందని దేశంలో ఎక్కడ కూడా మహిళలను కాపాడిన చరిత్ర లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళల పైన అత్యాచారాలు, హత్యలు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ల కు పెద్దపీట వేసి లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి వారికి అండగా నిలబడ్డ మోడీ చిన్న సన్న కారు రైతులు చేసిన రుణాలను బలవంతంగా వసూలు చేసి రైతుల పాలిట శాపంగా మారాడన్నారు. నరేంద్ర మోడీని ఎన్నికలలో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ పెద్ద నోట్లు రద్దుచేసి నల్లధనాన్ని బయటకి తీస్తాను అని ప్రగాల్బాలు పలికిన మోడీ పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశానికి ఒరిగింది ఏమీ లేదన్నారు. నోట్ల రద్దు తర్వాత పేదలు అవస్థలు పడి చనిపోయిన ఘటనలు ఉన్నాయని ఆయన విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక బ్రతుకులను నాశనం చేసిన నరేంద్ర మోడీని ఈ ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన ప్రజలకు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు , జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంఎ రియాజ్, గండిపేట మండల కార్యదర్శి బాబురావు , ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్ స్వామి, ఆఫీస్ కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.



# యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి రంగాలలో కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రోత్సహిస్తున్నాడు

**ఎంపీగా కొండ విశ్వేశ్వర్ రెడ్డినే సరైనోడు..**
**బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**

కూకట్‌పల్లి, మే 6 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దత్తాత్రేయ కాలనీలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ స్థానిక యువతతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆల్విన్ డివిజన్ లోఉన్న యువత నిర్వీర్యమైపోతున్న ఏ ఒక్క రోజు కూడా చేవెళ్ల ఎంపీగా రంజిత్ రెడ్డి యువత కోసం ఏం చేయలేదని అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ కి ఎంపీ యొక్క అభివృద్ధి నిధులు ఎన్ని ఇచ్చారో చెప్పాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను అడుగుతున్నామన్నారు. ఎల్లమ్మ బండ ప్రాంతంలో ఉద్యోగాలు లేక ఉపాధి లేక యువత రోడ్లమీద తిరుగుతున్న కూడా వారి కోసం ఆలోచన చేయలేదు అన్నారు. కనీసం ఎంపీ నిధులతో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు కూడా చేయలేదు అని అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ కి ఎలాంటి అభివృద్ధి చేయలేని అసమర్ధ రంజిత్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. అలాగే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి రంగాలలో యువతను ప్రోత్సహిస్తున్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి మద్దతునిచ్చి గెలిపించాలని యువతను కోరుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, శ్రీను, భరత్, రాము,లింగం, అశోక్, రాకేష్, సాయి, ఝూన్సీ, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.



# అమలు కాని హామీలతో ప్రజలను ఎన్ని రోజులు మభ్యపెడతారు

**పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారు....**
**ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్**

కూకట్‌పల్లి, మే 6 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కొరకు స్థానిక శాసనసభ్యులు గాంధీ ఆదేశాలతో ఆల్విన్ కాలనీ ఫేస్2, ఆదిత్య నగర్, రాఘవేంద్ర కాలనీ, సాయి నగర్ వెస్ట్, కాలనీలో ప్రచారంలో సంబంధిత కాలనీ అధ్యక్షులు కృష్ణ రావు, కట్ట శ్రీను, రాజేష్, చంద్ర, కాశీనాథ్ యాదవ్, చిన్నాల శ్రీను తదితరులతో కలిసి డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్ వారితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రభుత్వం ఏర్పరిచినప్పటికీ స్థానికంగా ప్రజల మనసును దోచుకోలేకపోయింది. దీనికి కారణం తీవ్ర త్రాగునీటి సమస్య, కరెంటు సమస్య, పారిశుద్ధ్య కార్మికుల లోపం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లో తులం బంగారం, ప్రతి మహిళకు 2500 భృతి, ప్యాసింజర్ ఆటో ఉన్నవారికి 12000 చేయూత, నిరుద్యోగుల 4000 భృతి , రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయల సబ్సిడీ గ్యాస్ ఇలాంటి కీలకమైన హామీలను మూడు నెలల్లో ఇస్తానని మాట ఇచ్చి అవి నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ప్రజల గట్టి గుణపాఠం చెప్తారుఅని అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్లో కొంతమంది నాయకులు మభ్యపెట్టి, ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ లో చేసుకోవడం జరుగుతుంది, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ విధేయులుగా ఉంటూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు కార్యకర్తలు, మహిళలు, యువకులు ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పార్టీలో గుర్తింపునివ్వడం లేదని టిఆర్ఎస్‌కు వీరేందర్ రెడ్డి రాజీనామా



శంషాబాద్, మే 6( ప్రభాత ఉదయం) టిఆర్ఎస్ పార్టీ శంషాబాద్ మున్సిపల్ కార్యదర్శి దమ్మాయిగూడ వీరేందర్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. టిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసినప్పటికీ తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో పని చేసే వారికి ప్రజల గుర్తింపుని ఇవ్వకపోవడం పైగా ప్రజా సమస్యలను దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదని అన్నారు. శంషాబాద్ టిఆర్ఎస్ పార్టీలో నియంతృత్వ పోకడలు పోతున్నారని పార్టీ నాయకుల ధోరణికి నిరసనగా పార్టీ పదవికి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలోనే ప్రకటిస్తానని వీరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ద్వారానే దేశ ప్రజలందరికీ మేలు




శివరాంపల్లి రోడ్ షో లో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి



రోడ్ షోకు హాజరైన పలుగు చెరువు మహేష్, పిట్టల శివ ముదిరాజ్ తదితరులు

**చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి**

బుద్వేల్, మే6(ప్రభాత ఉదయం): భారతదేశ ప్రజలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం శివరాంపల్లి పరిసర బస్తీల్లో జరిగిన రోడ్ షో లో గడ్డం రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. అన్ని వర్గాల ప్రజలను, అన్ని మతాల ప్రజలను సమాన దృష్టితో పాలించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఓటర్ పాల్గొని తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ హస్తం గుర్తుకు వేయా లన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు . రోడ్ షోలో కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, నాయకులు పలుగు చెరువు మహేష్, పిట్టల శివ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు

# అబద్ధాలు చెప్పి మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, చిత్రంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్



ప్రజల ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

### గద్వాల పట్టణంలో సుడిగాలి ప్రచారం చేసిన ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 6(ప్రభాత ఉదయం) ఆరు గ్యారంటీల్లో ఒకటే ఇచ్చి ఐదు అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గద్వాల మున్సిపాలిటి పరిధిలోని 32, 33వ వార్డులలో చింతలపేటలో నాగర్ కర్నూల్ ఎంపీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కు మద్దతుగా గద్వాల ఎమ్మెల్యే ఇంటి ఇంటికి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోగద్వాల పట్టణం లో ప్రతి వార్డు లో అభివృద్ది పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి వార్డులో సిసి రోడ్డు డ్రైనేజీ , వ్యవస్థ నిర్మాణం కమ్యూనిటీ హాల్స్, పట్టణ ప్రకృతి ప్రకృతి వనం, వైకుంఠధామం నిర్మించినట్లు వెల్లడించారు.కాంగ్రెస్ వచ్చాక నిత్యావసర సరకుల ధరల కొండెక్కాయి. పింఛన్లు రావడం లేదని, దళిత బంధు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి పింఛను అన్నీ బంద్ అయినాయన్నారు. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామ రక్ష అని ఆయన పాలనలో మెడికల్ కాలేజీలు, నిరంతర కరెంటు, కేసీఆర్ కిట్టు.. ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాన్నారు. అబద్ధాలు చెప్పి మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి" బిజెపి పార్టీ కేంద్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కూడా ఏనాడు తెలంగాణ ప్రయోజనాల కోసం కాని తెలంగాణ రైతాంగం కోసం ఆలోచన చేయలేదు. బిఆర్ఎస్ నాగర్ కర్నూల్ పార్లమెంటు పార్లమెంట్ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నరహరి శ్రీనివాసులు, నాగిరెడ్డి, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షులు గోవిందు, ప్రధాన కార్యదర్శి సాయి శ్యామ్ రెడ్డి, ఉపాధ్యక్షులు ధర్మ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ జి.వేణుగోపాల్ , బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహబూబ్ , భగీరథ వంశీ కురుమన్న రామాంజనేయులు, సీతారాములు, నర్సింహులు, పవన్ యాదవ్ , నర్సింహులు మోబిన్ , శ్రీనివాస్ యాదవ్ పరశురాముడు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ రీతి రాజ్ కు ఫిర్యాదు చేస్తున్న మహిళ

# నిర్భయంగా తమ సమస్యలు తెలుపాలి

## గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 6(ప్రభాత ఉదయం) ఫిర్యాదుదారులు నిర్భయంగా తమ సమస్యలను పోలీస్ స్టేషన్ లలో తెలియజేస్తే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించి పోలీస్ అధికారులు చట్ట ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 05 మంది బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ జిల్లా ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులలో భూమి తాకట్టు పెట్టి డబ్బులు అప్పుగా తీసుకొనగా ఇప్పుడు డబ్బులు తీసుకొని తమ భూమిని తమకు ఇవ్వమంటే ఇవ్వడం లేదని -01 ఫిర్యాదు. గురుకులం లో సీటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని సీటు ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని -01 ఫిర్యాదు. భూమిని సర్వే చేసేందుకు ప్రభుత్వ సర్వేయర్ ను తీసుకెళ్తే ప్రక్క భూమి వారు సర్వే ను అడ్డుకుంటున్నారు అని -01 ఫిర్యాదు. ఇతర అంశాలకు సంబంధించి -02 వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు. పిర్యాదు దారులు తమ సమస్యలను స్వేచ్ఛగా, నిర్భయంగా పోలీస్ స్టేషన్ లలో తెలియజేయాలని వచ్చిన ఫిర్యాదుల పై అధికారులు వాస్తవాలను తెలుసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హౌసింగ్ బోర్డ్ నిర్మాణం

### కెపిహెచ్బి కాలనీ ఫోర్త్ ఫేస్ వెంచర్ 2 లో సమస్యలు పరిష్కరిస్తాం...

### పెద్ద ఎత్తున మహిళా నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిక...

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన శేరి సతీష్ రెడ్డి...

కూకట్‌పల్లి, మే 6 (ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో పలువురు మహిళ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అల్పాదయ వర్గాలు ఫేస్ 2 లో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మహిళా నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా మల్కాజ్ గిరి పార్లమెంటు అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కుమార్తె మనిషా రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీతోపాటు ఫోర్త్ ఫేస్ లోని వెంచర్ 2 లో నెలకొన్న సమస్యలను ఎన్నికల తర్వాత పరిష్కరిస్తామని అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించి కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణలో స్థిర పడిన 26 కులాలను అన్యాయంగా ఓసి జాబితాలో చేర్చారని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి ఆకర్షితులై శెట్టి బలిజ ఉద్యమ నాయకురాలు ధనలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సతీష్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఇతర పార్టీల చెందిన పలువురు మహిళా నాయకురాళ్ళు పుష్ప వేణి, కృష్ణ కుమారి, దేవి, పద్మ, లక్ష్మి వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 26 కులాలకు చెందిన వారిని అన్యాయంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఓసి కులాల్లో చేర్పించడం మూలంగా తమకు తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీలో చేరిన 26 కులాల పోరాట నాయకురాలు ధనలక్ష్మి తెలిపారు. తాము కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సంధ్యారాణి, టి ప్రవీణ్ కుమార్, డివిజన్ అధ్యక్షురాలు రజిత, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, మేకలు మైకల్, రాజేష్ గౌడ్, అప్పారావు, సూరిబాబు , అనిల్ రెడ్డి, శేషగిరిరావు, నితీష్ గౌడ్, సుందరి, తదితరులు పాల్గొన్నారు.

# వెండికొండలో ప్రతి సోమవారం అన్నదానం

## మడపతి నరేందర్ యాదయ్య గౌడ్

శంషాబాద్,మే 6(ప్రభాత ఉదయం) శంషాబాద్లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వెండికొండ సిద్దేశ్వర ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని చేయనున్నట్లు వెండికొండ సిద్దేశ్వర ఆలయం ఫౌండర్ చైర్మన్ మడపతి నరేందర్. ఝాన్సీమియా గుడ ఎంపీటీసీ సభ్యుడు పూసలపాటి యాదయ్య గౌడ్ తెలిపారు.



భక్తులు ఇచ్చిన విరాళంతో ప్రతి సోమవారం దేవాలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కూడా ఎవరైనా అన్నదాన కార్యక్రమాన్ని చేయించవచ్చని సూచించారు.అన్ని దానాల్లోకి అన్నదానం ఎంతో గొప్పదని వారు పేర్కొన్నారు.



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు


# పట్టపగలు పెబ్బేరులో దొంగల హల్‌చల్

### 19 తులాల బంగారం.. ఒక లక్ష అరవై వేల నగదు చోరి

పెబ్బేరు, మే 6(ప్రభాత ఉదయం)పెబ్బేరు మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ కు కూతవేటు దూరంలోనే పట్టపగలు ఇంట్లో దొంగల హల్చల్ చేయడం తో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం పెబ్బేరు పట్టణంలో బోయ రామకృష్ణ ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో దొంగలు పడి 19తులాల బంగారం, ఒక లక్ష అరవై వేల నగదును దొంగిలించిన్నట్లు ఎస్. ఐ హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. భార్య ఆదివారం చుట్టాల ఊరికి వెలగా సోమవారం ఇంటి యజమాని రామకృష్ణ ఉదయం ఇంటి నుండి బయటికి వెళ్ళి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం విరిగి ఉండటం గమనించి పోలీసులకు పిర్యాదు ఇవ్వడం తో పోలీసులు ఘటన స్థలానికి వెళ్ళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# అభ యాప్ ద్వారా ఓపి రిజిస్ట్రేషన్

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 6(ప్రభాత ఉదయం)రోగులు తమ చరవాణిలో అభ యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని ఓపి రిజిస్ట్రేషన్ ను సులువుగా చేసుకోవచ్చు అని గద్వాల జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రోగులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చినప్పుడు ఓపి రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిలుచునే అవసరం లేకుండా ఈ యాప్ డౌన్ లోడ్ చేసుకుని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని సంబంధిత వైద్యులతో చికిత్స పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. యాప్ డౌన్ లోడ్ చేసుకున్నాక చరవాణిలో ఆధార్ సంఖ్యతో రిజిస్టర్ అవ్వాలన్నారు. దాంతో వారికి ఒక యూనిక్ అభా సంఖ్య వస్తుందని చెప్పారు. అబా సంఖ్యతో తిరిగి ఆప్ లో లాగిన్ అయి క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వెంటనే ఒక టోకెన్ నెంబర్ వస్తుందన్నారు. ఈ టోకెన్ నెంబర్ ను ఆసుపత్రిలోని ఓపి రిజిస్ట్రేషన్ కౌంటర్లో చెబితే వెంటనే సంబంధిత డాక్టర్ వద్దకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.





ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్

# పొరపాట్లకు తావియ్యకుండా ఎన్నికల విధులు నిర్వహించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 6(ప్రభాత ఉదయం)పార్లమెంటు ఎన్నికలలో భాగంగా మే 13 న జరగనున్న పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు ఈవీఎంల శిక్షణలో అవగాహన పెంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావియ్యకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. సోమవారం గద్వాలలోని ఎంఎఎల్ డి కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలపై అవగాహన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ ఎన్నికలు 2024 లోక్ సభ ఎన్నికల నిర్వహణలో పి.ఓ , ఏ.పి. ఓ , ఓ.పి.ఓ ల పాత్ర చాలా కీలకమని, ఈవిఎం వాడకంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నిర్దేశిత పత్రాలలో వివరాల నమోదు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పేపర్ సీలింగ్, ప్యాకింగ్ వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమంలో పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. సెక్టోరల్ అధికారికి ఎప్పటికప్పుడు సమాచారం అందేలా చూడాలని, 17%జ% డేటా పక్కాగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామాగ్రి, ఈవిఎం లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నందు ఇవ్వబడతాయని, వాటిని చెక్ లిస్ట్ మేరకు సరిచూసుకోవాలని అన్నారు. మాక్ పోల్ జరపకుండా పోలింగ్ ప్రారంభించకూడదని,పి.ఓ డైరీ, పి.ఓ రిపోర్ట్ ఇతర పత్రాలు ఎప్పటికప్పుడు పి.ఓ లు నమోదు చేయాలనీ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత సెక్టోరల్ అధికారికి, రిటర్నింగ్ అధికారికి తెలియ చేయాలన్నారు. విధులు కేటాయించబడిన పి.ఓ లు, ఏపీఓ లు, ఇతర పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రానికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఈవిఎంలను పోలింగ్ సామాగ్రిని తీసుకెళ్లేటప్పటి నుండి తిరిగి ఈవీఎంలను రిసెప్షన్ కేంద్రంలో అప్పగించే వరకు బాధ్యతగా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, పి. ఓ లు, ఏ.పి.ఓ లు,ఓ.పి.ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

## శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మే 6 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని శేరిలింగంపల్లి ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పలువురు వెల్ఫేర్ సభ్యులు, బస్తీకి చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అభివృద్ధిని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి బరిలో ఉన్న గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి మరోమారు పార్లమెంటుకు పంపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బస్తి ప్రధాన కార్యదర్శి ఆర్.భగవంత రెడ్డి, నాయకులు మల్లేష్ మేస్త్రి, రాజిరెడ్డి టైల్స్, దాకూరు తిరుపతిరెడ్డి, నరసింహ, ఎల్లయ్య, కిరణ్ , రాజు , రంగా రాజు, వెంకటేష్, ఆంజనేయులు, రమేష్, ఉప్పలయ్యలను జగదీశ్వర్ గౌడ్ పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బస్తి కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ నాయకులు కె.వి .రాజు, తాటి కిరణ్, మొగుళ్ల కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాన్పు కోసం వస్తే కడుపు కోత

### వైద్యులపై ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఆగ్రహం

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 6(ప్రభాత ఉదయం)కాన్పు కోసం వస్తే కడుపుకోత మిగిల్చారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యంతోనే తన బిడ్డ మృతిచెందాడని ఓ తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించారు. సోమవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు వీరేష్ తెలిపిన వివరాల ప్రకారం గట్టు మండలం బోయలగూడెంకు చెందిన సుజాత కు పురిటి నొప్పులు రాగ మూడో కాన్పుకోసం గట్టు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో అడ్మిట్ చేశారు. అక్కడి వైద్యుల సూచనమేరకు గత వారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు. ఇక్కడ వైద్య పరీక్షల అనంతరం తిరిగి గట్టు పిహెచ్ సి కి వెళ్లారు. సోమవారం పురిటినొప్పులు ఎక్కువ కావడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పురిటినొప్పుల బాధపడుతున్న గర్భిణిని జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. స్కానింగ్ కోసం ఓ ప్రైవేట్ డయోగ్నోస్టిక్ సెంటర్ రెఫర్ చేశారు స్కానింగ్ అనంతరం కాన్పు కోసం థియేటర్ లో కి తీసుకెళ్లగా కొద్ది సేపటికి బాబు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పురిటినొప్పులతో బాధపడుతున్న తన భార్యను జిల్లా ఆసుపత్రికి తీసుకరాగ సుమారు 2గంటల పాటు వైద్యులు ఎవరు పట్టించుకోలేదని, నొప్పులు భరించలేక మొత్తుకుంటున్నా సిబ్బంది పట్టించుకోలేదని, కాళ్లా వేళ్లాపడినా ఏం చేయాలో మాకు తెలుసులే అంటూ చీదరించుకున్నారని బాధితులు ఆరోపించారు. జిల్లా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృతిచెందాడని, విచారణ జరిపి వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఆరోపించారు.



మృతి చెందిన శిశువు



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

### వైద్యులపై ఆగ్రహం చేసిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి కడుపులో చిన్నారి మృతి చెందారని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించిన రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రిలలో వైద్యం చేయడానికి ఆసక్తి చూపెడుతున్నారని, నిరుపేదల ప్రాణాలను గాలోకి వదిలేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘటనపై జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ ను వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.